సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

# జిల్లా ఆడిటర్‌కు పురస్కారం

**కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ఆడిట్ విభాగానికి చెందిన కాకినాడ జిల్లా ఆడిటర్ వై.సురేష్ ఉత్తమ పనితీరు ప్రదర్శించి రాష్ట్ర ప్రభుత్వ పరిష్కారం అందుకున్నారు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలందించే అధికారులు, సిబ్బందిని ప్రభుత్వం గౌరవించి ప్రశంసా పత్రాలు అందజేస్తుంది. ఇందులో భాగంగా జిల్లా ఆడిటర్‌గా పనిచేస్తున్న సురేష్‌ను ఉత్తమ జిల్లా అధికారిగా గుర్తించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ప్రశంసా పత్రం అందజేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలతోపాటు ప్రత్యేకంగా దేవాదాయశాఖలో ప్రతి చెల్లింపునకు ప్రి-ఆడిట్ చేస్తున్నారు. కొందరు ఆడిటర్లు కొర్రీలు వేస్తున్నప్పటికీ ఈ శాఖకు ఎలాంటి చెడ్డ పేరు రాకుండా జిల్లా ఆడిట్ ఆఫీసర్ వై సురేష్ చర్యలు తీసుకుంటున్నారు.

ఎక్కడైనా పొరబాట్లు జరిగినా దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి వాటిని సవరిస్తున్నారు. అదేవిధంగా ఆడిటర్లు కూడా పారదర్శంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో జిల్లా ఆడిటర్‌గా పనిచేసిన చంద్రరావు తరహాలోనే సురేష్ అందరినీ కలుపుకొని వెళ్తూ అన్ని ప్రభుత్వ విభాగాలలో వార్షిక ఆడిట్ పారదర్శకంగా జరిగేలా తీసుకుంటున్న చర్యలతో ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రసంసాపత్రంతో గౌరవించింది. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, ఆ శాఖ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ, పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామమోహనరావు, పాదగయ అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని, ఇన్స్పెక్టర్ లు వడ్డి ఫణీంద్ర కుమార్, బాబు నాయుడు, ఈవోలు సౌజన్య, ఎస్.సత్యవాణి, వడ్డాది సత్తిబాబు, వడ్డి శ్రీనివాసరావు, ఆర్.రాజేశ్వరరావు, ఎం.మురళి వీరభద్రరావు, కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు ఘనంగా అభినందించారు.

# బదిలీకి రాయ'బేరా'లు

- రంగంలోకి ద్వితీయశ్రేణి నాయకులు
- ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారులు

**కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం 15 ప్రభుత్వ విభాగాలలో బదిలీలకు అనుమతిస్తూ జీఓ జారీ చేసింది. సోమవారం నుంచి 31వ తేదీవరకు బదిలీలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనితో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది మంత్రులు, ఎమ్మెల్యేలు,వారి అనుచరుల చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యంగా తహసిల్దార్లు, ఎండిఓలు, ఎస్ఐ లు, పౌరసరఫరాల శాఖ ఎంఎస్ఓలు,ఇరిగేషన్ డ్రైనేజ్ శాఖల ఏఈ,డిఇలు, సెర్ప్ ఏపీఎం, డిపిఎంల బదిలీలకు డిమాండ్ ఏర్పడింది.

అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల బదిలీలతో పాటుగా సచివాలయ సిబ్బందిబదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో వీరంతా ఎమ్మెల్యేలు, మరికొందరు ద్వితీయశ్రేణి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో కొందరు ఎమ్మెల్యేల అనుచరులు తాము బదిలీలు చేయిస్తామంటూ అధికారులతో రాయబారాలు నడుపుతున్నట్లు సమాచారం. ఖచ్చితంగా తమ నియోజకవర్గంలో తాసిల్దార్లు, ఎండిఓలు, ఎస్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలుతాము చెప్పినవారే ఉండాలని ఎమ్మెల్యేలు పట్టు పడుతున్నారు.మరోపక్క కొందరు మంత్రుల నుంచి లెటర్లు తెచ్చుకుంటున్నారు. అసలు బదిలీల జీవో రాకముందే జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు తమకు కావలసిన అధికారులకు సిఫార్స్ లెటర్‌లు ఇచ్చేసారు. బదిలీలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి అయినప్పటికీ ముందుగానే సిఫార్సుల లేఖలు ఇవ్వడం విశేషం. కొందరు ఎమ్మెల్యేలు అయితే ఒకే పోస్ట్ కోసం ఇద్దరు ముగ్గురికి లేఖలు ఇచ్చారనిజిల్లాఅధికార వర్గాలు వెల్లడించాయి. సెర్ప్ పోస్టుల కోసం పెద్దగా డిమాండ్ కనపడటం లేదు.

ఇక దేవాదాయశాఖ బదిలీలపై ఒత్తిడి పెరుగుతోంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీనియర్. నీతి నిజాయితీగల ప్రజా ప్రతినిధి. తరతరాలుగా వారి కుటుంబం నిజాయితీగా రాజకీయం చేస్తోందన్న

పేరు ఉంది. ఇలాంటి నేపథ్యంలో ఆయనపై ఒత్తిడి తేలేక ఎమ్మెల్యేలు కమిషనర్‌కు లేఖలు ఇస్తున్నారు. కాకినాడ డిప్యూటీ కమిషనర్‌గా విజయరాజు సర్వీసు ఐదు సంవత్సరాలు పూర్తి కావడంతో ఆయనను అన్నవరం దేవస్థానానికి బదిలీ చేస్తానని సమాచారం.

ఆయన స్థానంలో ప్రస్తుతం అన్నవరం ఇంచార్జి ఈఓగా పని చేస్తున్న డి.ఎల్.వి. రమేష్ బాబును నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. గతంలో అసిస్టెంట్ కమిషనర్ హోదాలో రమేష్ బాబు ఇన్చార్జ్ డిప్యూటీ కమిషనర్‌గా మెరుగైన సేవలు అందించారు. అదే విధంగా ఈఓ పోస్టుల కోసం పలువురు పైరవీలు ప్రారంభించారు.

**దేవాదాయ శాఖలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు వెనక్కి..**

పలువురు రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు దేవాదాయ శాఖలో చేరి పెత్తనం చేస్తున్నారు. ఓ విధంగా చెప్పాలంటే గత ప్రభుత్వమే రెవిన్యూ శాఖకు చెందినవారిని తమకు అనుకూలంగా నిధులు, భూములకోసం వీరిని నియమించిందని సమాచారం. దీంతో కూటమి ప్రభుత్వం వీరందరినీ వెనక్కి పంపుతారని అధికారవర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఆర్డీవోలుగా పని చేస్తున్నవారు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణఅధికారిగా ఉన్న ఆర్డీవోలను వెనక్కి పంపించాలని నిర్ణయించారు.

విఆర్వో మొదలు ఆర్డీవో వరకు గత ప్రభుత్వ హయాంలో భూములకు సంబంధించి ఎన్ఓసీలు జారీలో వైసిపి ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. అలాగేదేవాదాయశాఖలో పనిచేసేరెవిన్యూ అధికారులతో పాటు మొత్తం రెవిన్యూ వ్యవస్థనే ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. విజయవాడ కనకదుర్గ,శ్రీకాళహస్తి ,శ్రీశైలం సింహాచలం, పెనుగ్రంచి ప్రోలు ఈవోలుగా రెవిన్యూ అధికారులు పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితమే రెవెన్యూకు చెందిన కాణిపాకం ఈవోను తిరిగి రెవెన్యూ శాఖకు పంపించారు. రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనర్ గా రెవిన్యూ అధికారే ఉన్నారు.

ఇలాంటి నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెనక్కి వెళితే తమకు పదోన్నతులు వస్తాయని దేవాదాయ శాఖ అధికారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ప్రజాప్రతినిధులకు డిమాండ్ పెరిగింది. కొందరు తమకు అనుకూలమైన పోస్ట్ఇస్తే పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చేందుకు కూడాసిద్ధంగా ఉన్నారు. ఈ బదిలీలు కాసుల వర్షం కురిపించునున్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు లెటర్ల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కార్యదర్శిలు, విఆర్ఓలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

## కూటమి ప్రభుత్వం జైళ్ల శాఖలో బదిలీలకు అనుమతించాలి

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 15 ప్రభుత్వ విభాగాలలో బదిలీలకు అనుమతించింది. అయితే ప్రభుత్వం బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 75లో ఆంధ్రప్రదేశ్ కారాగార సంస్కరణల శాఖలో విధులు నిర్వహించే ఉద్యోగుల బదిలీల ప్రస్తావన లేదని ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంబుల విశ్వేశ్వరరావు తెలిపారు. జైళ్ల శాఖలో దిగువ స్థాయి ఉద్యోగులైన వార్డర్లు, హెడ్ వార్డులు, చీఫ్ హెడ్ వార్డర్లు రాష్ట్ర స్థాయి పరిధిలో విధులు నిర్వహించవలసిన నేపథ్యంలో అనేకమంది ఉద్యోగులు తమ సొంత ప్రాంతాలకు సుదూరంగా విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలు అయిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన అనేకమంది నిరుద్యోగులు రాయలసీమ ప్రాంతాలైన కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొన్ని సంవత్సరాలుగా జైళ్ళలో విధులు నిర్వహిస్తూ వారి కుటుంబాలకు దూరంగా ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ జీవోలో ఆంధ్రప్రదేశ్ జైల్లో శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తద్వారా వారి కుటుంబాలకు దగ్గరగా వారు ఉండే వెసులుబాటు కలుగుతుంది అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మానవీయ దృక్పణంలో ఆలోచించి తమ శాఖలో బదిలీలకు అనుమతించాలని విశ్వేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో తమకు న్యాయం జరగలేదని ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అయినా తమ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేసే విధంగా బదిలీలకు అనుమతించాలని ముఖ్యమంత్రి, హోం మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు విశ్వేశ్వరరావు వెల్లడించారు.

## వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలి

**- సీఐటీయూ డిమాండ్**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఎన్నికల హామీ ప్రకారం గ్రామ వార్డు వాలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలని,రూ.10వేలువేతనం చెల్లించాలని సీఐటీయూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన విజయవాడ ఎమ్.బి భవన్‌లో జరిగే రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుందని సీఐటీయూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లానాయకత్వం పిలుపు ఇచ్చిందన్నారు.ఈ సందర్భంగా సీఐటీయూ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రామ వార్డు వాలంటీర్లకు ప్రభుత్వం అధికారం లోకి వస్తే రూ.10వేలు వేతనం ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా వాలంటీర్ల పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు వెంటనే పరిష్కారం చేసే దిశగా గ్రామ వాలంటర్లను నియమించిన విషయం విధితమే అయినా ప్రభుత్వం ఇచ్చిన బాధ్యత కన్నా ప్రజలకు అత్యంత చేరువలో ఉంటూ పని చేయడంలో కీలక పాత్ర పోషించిన వాలంటీర్లను ఎన్నికలు సందర్భంగా రెండు నెలలు పక్కన పెట్టారని ఆరోపణలు చేశారు. ఎన్నికల అనంతరం తిరిగి విధుల్లోకి తీసుకోవాల్సి ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని మర్చిపోయి వ్యవహరిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.5వేలు గౌరవ వేతనం చాలకపోయినా అనేక సేవలు ప్రజలకు చేరువలో అందించిన గ్రామ వార్డు వాలంటీర్ల పట్ల ఇంతటి నిర్లక్ష్యం ఏంటని కూటమి ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించారు. కాబట్టి కూటమి ప్రభుత్వం గ్రామ వాలంటీర్ల పట్ల తక్షణమే పునరాలోచించి తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని, ఎన్నికల హామీ ప్రకారం రూ.10 వేలు వేతనం చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ తరపున ఆమె డిమాండ్ చేశారు.గ్రామ వాలంటీర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో విజయవాడ ఎమ్.బి. భవన్‌లో రాష్ట్ర వాలంటీర్ల సదస్సు జరుగుతుందన్నారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాల పరిధిలో ఉన్న గ్రామ, వార్డు వాలంటీర్లు పెద్ద ఎత్తున ఈ సదస్సులో పాల్గొని విజయ వంతం చెయ్యాలని వాలంటీర్లకు ఆమె పిలుపునిచ్చారు.

## అన్నదాన భవన నిర్మాణానికి లక్ష విరాళం

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం రావులపాలెంకి చెందిన గంధం రామారావు సూర్య వెంకట లక్ష్మీ దంపతులు రూ.1,01,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందించారు.

## డిప్యూటీ కమిషనర్ పర్యటన

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ఆదివారం కోనసీమ జిల్లాలో పర్యటించారు. కుటుంబ సమేతంగా పలు ఆలయాలలో పూజలు చేశారు. మురమళ్ళ శ్రీ భద్రకాళి సమేత వీరస్వామిని దర్శించుకున్నారు. అనంరం ప్రముఖ పుణ్యక్షేత్రం ఆదిగణపతి కొలువుదీరిన అయినవిల్లిలో కుటుంబ సమేతంగా ఐనవిల్లి వినాయకునికి పూజలు చేశారు. తన మనుమలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని చేయించారు. అయినవిల్లి ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈవో ముదునూరి సతీష్‌రాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దగ్గరుండి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ పర్యటనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ, కాకినాడ, అమలాపురం ఇన్స్పెక్టర్లు వడ్డి ఫణీంద్ర కుమార్, రామలింగేశ్వరరావు, అమలాపురం ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు, దేవాదాయశాఖ డిఈ శ్రీనివాస్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ మూర్తి తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

## సిఐ బాధ్యతల స్వీకరణ

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కాకినాడ నగరంలో పనిచేసిన సిఐలందరినీ శంకరగిరి మాన్యాలు పట్టించారు. ఏ ఒక్కరికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఇప్పటికే పోర్ట్, టు టౌన్ నూతన సిఐలు బాధ్యతలు స్వీకరించారు. తాజాగా వన్టౌన్ సిఐగా నాగ దుర్గారావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. వన్ టౌన్ సీఐ సురేష్ బాబు, టూ టౌన్ సిఐ నాయక్, 3 టౌన్ సిఐ కృష్ణభగవాన్, పోర్టు సిఐ సుమంతులు బదిలీ అయ్యారు. అదేవిధంగా కాకినాడ రూరల్, సర్పవరం సీఐ లను కూడా బదిలీ చేశారు. వీరందరూ వైసిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యేలు చంద్రశేఖర్ రెడ్డి, కన్నబాబులకు అనుకూలంగా పనిచేసా రన్న ముద్రపడింది. దీంతో వీరెవరికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఒక్కొ క్కరిగా కొత్తవారు బాధ్యతలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే వన్ టౌన్ సిఐ నాగ దుర్గారావు విధుల్లో చేరారు.

## పోలవరం ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**ధవళేశ్వరం,మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వంపై పోలవరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలు, పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఫైల్స్ తగలబెట్టిన ఘటనను తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని ఇందులో బాధ్యులైన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంపై తగిన విచారణ చేపట్టవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు సూచించడం జరిగిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పోలవరం ఎడమ కాలువ భూసేకరణ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సందర్శించి, ఘటన వివరాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కందులు దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనం ఉండేలా ప్రజలకు పరిపాలన అందించాలనే సంకల్పంతో ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చే రీతిలో కొందరు అధికారులు ఉద్యోగులు ప్రవర్తించడం, సంఘటనలు జరగడం వంటి వాటి విషయాలలో ఉపేక్షించే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం పై అవినీతి ఆరోపణలు నేపథ్యంలో ఆఫీసు రికార్డు రికార్డులకు సంబంధించిన పేపర్లను తగులు పెట్టిన విషయాన్ని తీవ్రంగా పరిణించడం జరుగుతుందన్నారు. ఇందులో వాస్తవాలను తెలుసుకునేందుకు జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టాలని మంత్రి కోరడం జరిగింది. ఇందులో దోషులను గుర్తించాలని ఆసక్తి వద్దని, ఈ ఘటనలో ప్రత్యక్షంగా పరోక్షంగా భాగస్వామైన వారిని ప్రతి ఒక్కరిని గుర్తించి కఠినమైన చర్యలని తీసుకోవాలన్నారు. ఇందులో భాగ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయం సంబంధించిన ఫైల్స్ పాతవి భద్రపరిచే ఉంచాలని, ఏమైనా ఫైల్స్ డిస్పోజ్ (పారవేయడం/కాల్చడం) చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావడం జరగాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవినీతిని కప్పిపుచ్చే విధంగా సంఘటనలు జరగడంపై ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. ఫైల్స్ డిస్పోజ్ చేసే క్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకోవలసిన వాటి విషయంలో సంబంధిత సిబ్బంది అలసత్వాన్ని ఉపేక్షించబడ్డని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించాలని సంకల్పానికి తూట్లు పొడిచే విధంగా ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని మంత్రి కందులు దుర్గేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి అందించిన సామాజిక భద్రత పెన్షన్లు రైతు బకాయిల చెల్లింపులు, సరసమైన ధరలకు నిత్యవసర వస్తువులు అందించేందుకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు.ఈ సంఘటనపై జాయింట్ కలెక్టర్ ఎస్. చిన రాముడు వివరణ ఇస్తూ, పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. భూ సేకరణ సంబంధించి ఫైల్స్ విషయంలో సంబంధిత సిబ్బంది అలసత్వం పై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. దోషులను తెలితే శాఖ పరమైన చర్యలతో పాటు, పోలీసు వారి ద్వారా క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పరిపాలనలో భాగంగా ఎల్డిస్ , డిడిస్, ఆర్డిస్ విధానంలో కాల పరిమితికి లోబడి ఆయా ఫైల్స్‌లను డిస్పోజ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎటువంటి ఫైల్స్ లను డిస్పోజ్ చేసే క్రమంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అనుమతులను అనుసరించి చర్యలు చేపట్టడం జరగాలన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి తదుపరి దోషులని తేలితే సస్పెండ్ చేయడంగాని, క్రిమినల్ కేసులు నమోదు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ఎస్ పి డి.నరసింహా కిషోర్ మాట్లాడుతూ, పోలవరం ఎడమ కాలువ భూసేకరణ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారము మధ్యాహ్నం ఫైల్స్ దగ్ధం చేసిన విషయం తెలిసిందేనని, ఆమేరకు డిఎస్పీ అధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలియ చేశారు. చెత్త తగులపెట్టే చిన్న ప్రదేశంలో కొన్ని ఆఫీసు కాగితాలు కాల్చి వేశారన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు చేసిన దృష్ట్యా విచారణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఫైల్స్ డిస్పోజ్ చేసే దిశలో మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడం, ఇందులో ఉద్దేశ్య పూర్వకంగా లేదా క్రిమినల్ ఉద్దేశ్యం ఉంటే ఈ పని చేసి ఉంటే అరెస్టు చేసి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. శాఖా పరంగా విచారణ అనుసరించి, పోలీసు శాఖ పరంగా కూడా తగిన విచారణ చేపట్టనున్నట్లు ఎస్పి నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ఈ సందర్భంలో రాజమండ్రి ఇన్చార్జి ఆర్డీఓ కే ఎల్ శివజ్యోతి, డిప్యూటీ కలెక్టర్ కె. వేదవల్లి, డిఎస్పీ భవ్య కిషోర్, రాజమండ్రి రూరల్ తహసీల్దార్ జె.లక్ష్మీ రమ్య,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఫైళ్ల దహనం కేసులో సస్పెండ్ అయిన అధికారులు

**రాజమహేంద్రవరం రూరల్ ,మేజర్ న్యూస్ :**శనివారం నాడు పోలవరం ఎడమ కాలువ సంబంధించిన కార్యాలయంలో ఫైలు దహనం కేసు జరగడం లేదు.పోలవరం ఎడమ కుడి కాలవ (ఎల్ ఎ) కార్యాలయ ఫైళ్ళ దహనం కేసులు భాగస్వామ్యం అయిన సీనియర్ అసిస్టెంట్‌లు కే..నూకరాజు, కారం బేబి, స్పెషల్ రెవెన్యూ ఇనస్పెక్టర్ కె. కళా జ్యోతి, ఆఫీసు సభార్డినేట్ కె. రాజశేఖర్ లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.డిప్యూటీ తహసీల్దార్‌లు ఏ. కుమారి, ఏ. సత్య దేవి లకి షో కాజ్ నోటీసు జారీ చేయడం జరిగింది.ఫైళ్ళ దహనం ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా యంత్రాంగం విధుల్లో నిర్లక్ష్య వైఖరి ఉపేక్షించే ప్రసక్తి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ విషయంపై ధవలేశ్వరం పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసిన డిప్యూటీ కలెక్టర్ కె వేదవల్లి.. క్రైమ్ నెంబర్ 211/2024 ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవం

**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ప్రతి ఆదివారం స్వామివారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వచ్చిన భక్తులు రథోత్సవ సేవలో పాల్గొనేందుకు టికెట్లు తీసుకుని శ్రీ స్వామివారి రథోత్సవ సేవ పాల్గొన్న భక్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రథోత్సవ సేవలో వేద పండితులు, ఆలయ అర్చకులు, ఏఈఓ దామోర్ల కృష్ణారావు, సూపర్టెంట్ ఐవి రామారావు, పిఆర్ఓ విభాగం గణపతి, దేవస్థానం సిబ్బంది, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కవి సమ్మేళనంలో సుబ్బారావుకు ఘన సన్మానం

**కొత్తపేట, మేజర్ న్యూస్ :** జాతీయ కవి సమ్మేళనంలో కొత్తపేట కు చెందిన డాక్టర్ సుబ్బారావు వినిపించిన కవితా గానం పలువురు ప్రశంసలు అందుకుంది. శ్రీ శ్రీ కళావేదిక 138వ జాతీయ కవి సమ్మేళనం అమలాపురం శ్రీ అంబేద్కర్ కళాభవనంలో ఆదివారం నిర్వహించారు. ఆ కవి సమ్మేళనంలో కొత్తపేటకు చెందిన డాక్టర్ వి.వి.వి.ఎస్ సుబ్బారావు వినిపించిన తెలుగు కీర్తి సౌరభాలు పద్య కవితకు సుబ్బారావు ను ఘనంగా సన్మానించారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్ జాతీయ అధ్యక్షులు బాలార్జున సత్యనారాయణ,కొల్లి రమావతి జిల్లా కన్వీనర్ బి.వి.వి సత్యనారాయణ జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి తదితరులు సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

# మరమ్మత్తులకు నోచుకోని పెండ్యాల పంపింగ్ స్కీం..

- నిరుపయోగంగా ఉసులుమర్రు ఎత్తిపోతల పథకం
- 2002లో ఏడు లక్షల రూపాయలతో నిర్మాణం
- ఆయకట్టు కింద 250 ఎకరాలు సాగు
- మంత్రి కందుల దుర్గేష్ పైనే కొండంత ఆశ

**పెరవలి,మేజర్న్యూస్ :** ఉసులుమర్రు గ్రామంలో 250 ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఎండ్యాల పంపింగ్ స్కీం టైలాండ్ ఆయకట్టు ఉసులుమర్రు ఎత్తిపోతల పథకం మరమ్మత్తులకు నోచుకోక నిరుప యోగంగా తయారైంది. జనవరి 2002వ సంవత్సరంలో అప్పటి పెనుగొండ శాసన సభ్యులుగా కూనపరెడ్డి వీరరాఘవేంద్రరావు (చినబాబు), నరసాపురం పార్లమెంట్ సభ్యులు మరియు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిగా యూవీ కృష్ణంరాజులు ఉండగా అప్పట్లో ఏడు లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈస్కీమును నిర్మించడం జరిగింది. కొద్ది సంవత్సరాలు అద్భుతంగా పనిచేసిన ఈ పంపింగ్ స్కీం మరమ్మతులకు గురవడంతో తదుపరి దీనిని పట్టించుకునే నాధుడే లేక ఇది మరుగున పడిపోయింది. ప్రస్తుతం కొద్దిపాటి మరమ్మత్తులు తో 250 ఎకరాలకు సాగునీరుఅందించే ఈ పథకం నిర్వీర్యం అయిపోయిందని ఉసులుమర్రు గ్రామ రైతు కొత్తూరు వీర్రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎత్తిపోతలపథకానికి నరసాపురంకాలవనుండి ఉసులుమర్రు పాత కోడు కాలువ ద్వారా నీరు వస్తుందని ఇక్కడినుండి మూడు భారీ మోటార్లతో పంపింగ్ చేసి ఆ నీటిని ఉసులమర్రు కానూరు అగ్రహారం గ్రామాల్లోని పంటచేలకు నీటి సదుపాయం కల్పించేందుకు అప్పట్లో ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు అన్నారు. ఈ పథకం కింద సుమారు 70 మంది సన్న చిన్న కారు రైతులు తమ వ్యవసాయాన్ని సాగు చేసుకుంటున్నారని ఈ పంపింగ్ స్కీం మరుగున పడిపోవటంతో రైతుల మనుగడ కష్టమైదనిఅయితే హెూరుగాలి గాలిలో దీపంలా విజ్ఞేశ్వరం పంపింగ్ స్కీం నుండి కొద్దిపాటి నీరు రావడంతో తాము తమ పంటచేలు ఇప్పటివరకు గట్టెక్కాయని అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆ విజ్ఞేశ్వరం పంపింగ్ స్కీము నుండి వచ్చే కాలువ గుర్రపు డెక్క టూటీతో పూడి పోయి నీటిప్రవాహంతగ్గి పోయిందని దీంతో రైతులకు సాగునీరు లేక అల్లాడుతున్నారని అన్నారు. 2002వ సంవత్సరంలో అప్పటి బిజెపి జిల్లా అధ్యక్షులు పెనుమత్స వెంకట సుబ్రహ్మణ్యం వర్మ, కేంద్రమంత్రి కృష్ణంరాజు, ఎమ్మెల్యే కూనపరెడ్డి వీర రాఘవేంద్రరావు (చినబాబు)ల చొరవతో పార్లమెంటు ఎంపీనిధులతోఈస్కీము ప్రారంభ మైందని అన్నారు. ఈ స్కీమ్‌లో 25 హార్స్ పవర్ మోటర్లు, పంపింగ్ ఎక్విప్మెంట్ అంతా సిద్ధంగా ఉందని చిన్నపాటి మరమ్మత్తులు చాలు అని అన్నారు. అప్పట్లో కొత్తపల్లి సుబ్బారాయుడు విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతుల అగచాట్లు తెలుసుకుని వెంటనే విద్యుత్ లైన్ మరియు పంపింగ్స్ స్కీముకుసరిపడా కపాసిటీ ట్రాన్స్ ఫారం మంజూరు చేశారని అయితే ఇప్పుడు ఎత్తిపోతల పథకం మూలన పడటంతో ఆ పెద్దల శ్రమ అంతా వృధా అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉండే ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫారం నిరుపయోగంగా ఉందని ఎలక్ట్రికల్ సిబ్బంది పట్టుకుని వెళ్లిపోయారని ఈ ఎత్తిపోతల పథకం వద్దనున్న ట్రాన్స్ఫారాన్ని విద్యుత్ సిబ్బంది తిరిగి బిగించేలా ఉత్తర్వులు ఇచ్చి కొద్దిపాటి నిధులు కేటాయిస్తే ఈ ఎత్తిపోతల పథకం పునర్ వైభవాన్ని సాధిస్తుందని రైతులు కోరుతున్నారు. ఈ పంపింగ్ స్కీము మూలన పడటం తో దీనిపై ఆధారపడ్డ సుమారు 70 మంది సన్న చిన్న కారు రైతులు తమ పంట పొలాలను కాపాడుకోవడానికి ప్రైవేటు మోటార్ల యజమానులను ఆశ్రయించి నీటిని తోడించుకుని పంటలు బతికించుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంపింగ్ స్కీం ద్వారా ఉసులుమర్రు రైతాంగానికే కాకుండా కానూరు అగ్రహారం గ్రామం వరకు ఈ నీరు కాలువ ద్వారా వెళుతుందని అక్కడి రైతులకు కూడా ఉపయోగపడుతుందని రైతులుపేర్కొన్నారు. లోగడ ఈ ఎత్తిపోతల పథకం పంపులు పనిచేసేటప్పుడు దీనికి సంబంధించిన కరెంటు బిల్లు శెట్టిపేట ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వాళ్లు కట్టేవారిని దీనిపై ఒకఆపరేటర్నుకూడా ప్రభుత్వమే నియమించింది అని అతని జీతం కూడా ప్రభుత్వం వారు ఇచ్చే వారని రైతుల సౌకర్యార్థం గత ప్రభుత్వాలు కల్పించిన సౌకర్యాలు అన్ని ఇప్పుడు ఏమయ్యా అని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు కోరిక మేరకు మూడు లక్షల రూపాయలు మంజూరయ్యాయని అధికారులు చెప్పారని అయితే ఆ నిధులు ఏమయ్యాయో తెలియదని ఇప్పటికైనా మన నిడదవోలు నియోజకవర్గ శాసనసభ్యులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కల్పించుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకుని వెళ్లి ఈ ఎత్తిపోతల పథకం పై చొరవచూపి రైతుల ఇక్కట్లు తొలగించేలాగా తగు చర్యలు తీసుకుని పంపులు తిరిగి యధా ప్రకారం రన్నింగ్ అయ్యేలా ఎత్తిపోతల పథకం ప్రారంభమయ్యేలా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రైతుల కోరుతున్నారు.

# అస్వస్థతకు గురైన రైతు కూలీలు

- పరామర్శించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి
- మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం

**బిక్కవోలు, మేజర్ న్యూస్ :** మండలంలోని, పందలపాక గ్రామంలో కూలి పని చేసుకునే 9 మంది రైతులు అస్వస్థకు గురికావడంతో వారిని 108 వాహనంలో అనపర్తి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. పందలపాక గ్రామానికి చెందిన శ్రీధర్ నారాయణరెడ్డి అనే రైతు పొలంలో గులుకులు చల్లడానికి వచ్చిన ఊల్లపల్లి, మాచవరం గ్రామాలకు చెందిన తోమ్మిది మంది రైతు కూలీలు గుళికలు చల్లిన కొద్దిగా వ్యవధిలోని అస్వస్థకు గురైనట్లు సమాచారం. గుళికలు చల్లిన కొద్దిసేపటికి 9 మంది కూలి రైతులు మజ్జిగ సేవించారని, మజ్జిగ సేవించిన కొద్ది సమయానికి ఒక్కొక్కరుగా అస్వస్థకు గురవుతున్నట్లు గమనించిన రైతు 108 వాహనంలో అనపర్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. రైతు కూలీలకు హాస్పటల్ వైద్యులు వైద్య సేవలు అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హుటాహుటిన హాస్పటల్‌కు చేరుకొని రైతు కూలీలను పరామ ర్శించి, వారికి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. రైతు కూలీల ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యుల్ని సూచించారు. కూలీ రైతుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, అవసరమైతే కాకినాడ, రాజమహేంద్రవరం తీసుకుని వెళ్లి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యులకు తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉందని, ఇది రైతు ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పలపాటి కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ

- నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే బూరుపల్లి శేషారావు
- శశి విద్యాసంస్థల చైర్మన్ వేణుగోపాలకృష్ణ

**పెరవలి, మేజర్న్యూస్ :** ఉసులుమర్రు గ్రామానికి చెందిన ఇటీవలే మరణించిన శతాధిక వృద్ధుడు ఉప్పలపాటి సుబ్బారావు దశదిన కార్యక్రమం సందర్భంగా ఆగస్టు 18వ తేదీ ఆదివారం వారి కుటు ంబ సభ్యులను నిడదవోలు మాజీ శాసనసభ్యులు నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బురుగుపలి శేషారావు,శశివిద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మాంటిసోరి విద్యాసంస్థల చైర్మన్ అనపర్తి ప్రకాష్‌లు దశదిన కార్యక్రమంలో పాల్గొని ఉప్పలపాటి కుటుంబ సభ్యులను పరామర్శించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉప్పలపాటిసుబ్బారావు భార్య శ్రీమతి ఉప్పలపాటి రామలక్ష్మి, కుమారుడు సత్తిరాజు లకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ఉప్పలపాటి సత్తిరాజు కు సంఘీభావం తెలియజేశారు.

## ఆగస్ట్ 19వ తేదీ సోమవారం "మీకోసం" ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

- జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్:** ఆగస్ట్ 19 వ తేదీ సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక- "మీకోసం" ద్వారా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్ చిన రాముడు, ఇతర జిల్లాల అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించ నున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నందు,అదేవిధంగా డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలో ఆయా ప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులోఉండిప్రజలునుంచిఅర్జీలు స్వీకరించనున్నట్లు తెలియ చేశారు.ప్రజలకి స్థానికంగా అందుబాటులో ఉండి అధికారులు డివిజన్, మండల కేంద్రాలలో అర్జీలు స్వీకరించడం పరిష్కారం చేయనున్నట్లు, కావునా ప్రజలు ఈ మేరకు స్థానికంగా ఉండే అధికారులకిఅర్జీలుఅందచేయాలనిఆప్రకటనలో పేర్కొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసులు రైడ్స్ ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** గ్రామంలోని శెట్టిబలిజ కాలనీ శివారు పంట పొలాలలో రహస్యంగా ఆడుతున్న పేకాట శిబిరంపై ఆదివారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాట రాయులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5వేల 200 రూపాయల నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాధరావు తెలిపారు. వీరిని రేపు ఉదయం కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. జగ్గంపేట మండల పరిధిలో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

## పెద్దాపురం మండలంలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

**పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్:** పెద్దాపురం మండలంలో ఆదివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. దీనిలో భాగంగా వడ్లమూరు గ్రామంలో జల్‌జీవన్‌మిషన్‌లో భాగంగా నిర్మించనున్న వాటర్ ట్యాంక్ (రూ.33 లక్షలతో జెజెఎం నిధులు) కు, పులిమేరు గ్రామంలో జల్‌జీవన్‌మిషన్‌లో భాగంగా నిర్మించనున్న వాటర్ ట్యాంక్ (రూ.33 లక్షలతో జెజెఎం నిధులు) కు, తిరుపతి గ్రామంలో జల్‌జీవన్‌మిషన్‌లో భాగంగా నిర్మించనున్న వాటర్ ట్యాంక్ (రూ.33 లక్షలతో జెజెఎం నిధులు) కు, శంఖుస్థాపనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మొయిళ్ళ కృష్ణమూర్తి, తుమ్మల సురేఖ నాని, దేవళ్ళ దుర్గావరలక్ష్మి సతీష్, టిడిపి నాయకులు జల్దాని బాబీ, అన్నవరం దేవస్థాన మాజీ బోర్డు సభ్యులు కందుల విశ్వేశ్వరరావు, చాగంటి గోపాలకృష్ణ, రాగాల ఉమ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ సింగన అరవింద్, మత్తాల రాజు, పలువురు కూటమి నాయకులు, ఆర్‌డబ్లూఎస్ జెఇ బి.అప్పలరాజు, క్లాస్-1 కాంట్రాక్టర్ పుసుపులేటి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న



శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాస జాతర మహోత్సవాలు పురస్కరించుకుని ముగింపు సందర్భంగా దేవస్థానం ఛైర్మన్ చింతపల్లి బ్రహ్మజీ, అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మరియు మున్సిపల్ మజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు)లు పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. దీనికి ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, అత్తెం వీరభద్రరావు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కొరిపూరి రాజు, యాళ్ళ వీరబాబు, కొల్లి రాజు, కొల్లి దుర్గాప్రసాద్, అనివిల్లి శాస్త్రి, వంగల పూడి సతీష్,కూటమి నాయకులు, కార్యకర్తలు, వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు,క్రాంతివీర్,లోవ,శివ పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,001లు విరాళం

**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కాకినాడ వాస్తవ్యులు రాయుడు శ్రీనివాసరావు రూ.1,00,001లు విరాళంగా ఏఈఓ దామోర్ల కృష్ణారావుకు అందజేశారు. వారి కుటుంబం పేరుమీద ఆగస్టు 18 వ తారీకున అన్నదానం జరిపించాలని దాత కోరినారు. దాతను దేవస్థానం అధికారులు అభినందించారు.

# వైల్డ్ లైఫ్‌పై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మంత్రి మంత్రి కందుల దుర్గేష్

- ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించేవారందరికీ వైల్డ్ లైఫ్‌పై ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ఎంతో అనుభూతినిస్తుంది
- రాష్ట్రంలో టెంపుల్ టూరిజంతో పాటు ఇకో,హెల్త్, ఫారెస్ట్ టూరిజంను అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ :** ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించే అందరికీ వైల్డ్ లైఫ్‌పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఎంతో అనుభూతినిస్తుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.ఆదివారం స్థానిక సిటీ గోదావరి బండ్ మల్లిగా సత్రం నందు గోదావరి వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వైల్డ్ లైఫ్‌పైఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించడం నాప్రత్యేకమైన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించేవారందరికీ ఈ వైల్డ్ లైఫ్ పై ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ఎంతో అనుభూతినిస్తుందన్నారు. ఫోటోగ్రఫీ అంటే ఒక ప్రత్యేకమైన కళ అని, దానిని మీరు నేర్చుకొని ప్రకృతి సౌందర్యాలను ఛాయా చిత్ర రూపంలో భద్రపరుస్తారన్నారు. ఇందులో మరో అడుగు ముందుకు వేసి వైల్డ్ లైఫ్‌పై ఫోటోగ్రఫీ చేసి మంచి మంచి ఛాయాచిత్రాలను తీసి, సేకరించి ఇక్కడ ఎగ్జిబిట్ చేయడం ఒక మంచి కార్యక్రమం అని మంత్రి పేర్కొన్నారు. వైల్డ్ లైఫ్ ను ప్రజలకు ఎగ్జిబిట్ చేసే విషయంలో ఇంకా వెనుకుబడి ఉన్నామన్నారు. వైల్డ్ లైఫ్ లో ఉన్నటువంటి ప్రత్యేకత మన జిల్లా వరకు మారేడుమిల్లి , రంపచోడవరంతో పాటు కోనసీమ లోని మడ అడవుల వైల్డ్ లైఫ్ దృశ్యాలు పై ఫోకస్ చేసి ప్రజలకు ఎగ్జిబిట్ చేసే అవసరం మనపై ఉందన్నారు. డాక్టర్ రవీంద్ర డ్రోన్ కెమెరాతో అద్భుతమైన ఫోటోగ్రఫీ ద్వారా తీసిన ఛాయాచిత్రాలను చూస్తే మన ప్రాంతంలోని ఇంత అందమైన దృశ్యాలు ఉన్నయా?.. అనే ఆశ్చర్యంతో కూడిన అనుభూతి కలుగుతుందన్నారు. వైల్డ్ లైఫ్ పై తీసిన ఛాయాచిత్రాలు పర్యాటకులు ఆకర్షించే విధంగా ప్రమోట్ చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 90 శాతం మేర టెంపుల్ టూరిజం ఉండగా , ఇకో, హెల్త్, ఫారెస్ట్ టూరిజం 10 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. టెంపుల్ టూరిజంతో పాటు శ్రీశైలం వంటి ప్రాంతాలలో శ్రీ మల్లికార్జున స్వామి దర్శనంతో పాటు పక్కనే ఉన్నటువంటి వాటర్ ఫాల్స్, టైగర్ రిజర్వ్, శ్రీశైలం డాం వంటి ప్రాంతాలను పర్యాటకులు ఆకర్షించే విధంగా ఒక సర్క్యూట్‌గా తీర్చిదిద్దడం వలన టెంపుల్ టూరిజం తో పాటు ఇతర పర్యాటకుల ఆకర్షించే ప్రదేశాలు అభివృద్ధి చెంది టూరిజంకు అత్యంత ప్రాధాన్యతను సంచరించుకుంటుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్లో అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ ద్రోణం రాజు భగవాన్ రాజు, డాక్టర్ రవీంద్ర కాపు న్యూరో సర్జన్, ప్రసాద్ పబ్లిక్ స్కూల్ యజమాని వజ్రాల నాగేంద్రప్రసాద్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ వంశీకృష్ణ, ఓ ఎల్ జి సి ఇంజనీర్ సంతోష్ కుమార్, ఎఫ్ సి ఐ మేనేజర్ సి ఎస్ ఎన్ మూర్తి, ఓఎన్జిసి రిటైర్డ్ ఇంజనీర్ నరేంద్ర చంద్రదాస్ వీరందరూ దేశ విదేశాల్లో తీసిన ఛాయాచిత్రాలను ఎగ్జిబిషన్లో ప్రదర్శించారు.

# భూముల కొనుగోలుపై విచారణ జరగాలి

**కొత్తపేట, మేజర్ న్యూస్ :** జగనన్న ఇళ్ల స్థలాల పేరిట జరిగిన భూములు కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం కొత్తపేట నియోజక వర్గంలో జగనన్న ఇళ్ల స్థలాల పేరిట సుమారుగా 348 ఎకరాలు భూములు కొనుగోళ్లు చేసిందని దాదాపుగా రూ.179 కోట్ల రూపాయల వ్యయం చేసిందన్నారు. 17,000 మందికి పైబడి ఇండ్ల స్థలాల పేరిట పట్టాలు పంపిణీ చేశారని,ఇందు కోసం మారుమూల శివారు ప్రాంతాల్లో నివాసయోగ్యం కానీ స్థలాలను కొనుగోలు చేశారని ఆరోపించారు.కొద్ది మందికి మాత్రమే గ్రామాలను ఆనుకుని ఉన్న స్థలాలను అందించి కనీసం రహదారులు లేని ప్రాంతాలులో ఒక గ్రామానికి చెందిన వారికి వేరే గ్రామంలోనూ స్థలాలను కేటాయించారని అన్నారు.దీనితో నియోజకవర్గంలో ఇప్పటికీ చాలామంది లబ్ధిదారులకు స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.భూములు కొనుగోళ్లులో భారీ అవినీతి జరిగిందని,రెట్టింపు ధరలకు భూములు కొనుగోలు చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగపరిచారని ఆరోపించారు. 2021 వ సంవత్సరంలో శివారు ప్రాంతాల్లో 18 నుండి 20 లక్షల విలువచేసే భూములను 45 నుండి 47 లక్షలకు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని అలాగే కొత్తపేట నియోజక వర్గానికి సంబంధించి జగనన్న ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూములు విలువ కన్నా ప్రభుత్వ అధికారులు చెల్లించిన ధర ఎక్కువగా కనపడుతుందని,దీనిపై సమగ్ర విచారణ చేపడితే అవినీతి వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.ఇళ్ల స్థలాల మెరక పేరుతో జరిగిన మట్టి దోపిడీపైనా విచారణ జరగాలని కోరారు.నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేసినట్లు చెబుతున్నా, పదుల సంఖ్యలో కూడా లబ్ధిదారులకు స్థలాలను అందించలేకపోయారని ఎద్దేవాచేశారు.గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పేరిట భూములు కొనుగోళ్లు, మెరక పనులు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని బాబ్జి కోరారు.

# ప్రధాని నరేంద్రమోడీ, చిత్రపటానికి, పాలాభిషేకం

కూనవరం ,మేజర్న్యూస్ : పెదరుకూరు గ్రామంలో ఆదివారం నాడు భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు విలీన మండలాలను కలుపుతూ 174కిలోమీటర్ల , ఒరిస్సా రాష్ట్రం, మల్కాజిగిరి,నుంచి చింతూరు కూనవరం, ఎటపాక మండలాల గుండా భద్రాచలం, పాండురంగ పురం రైల్వే లైన్ కలుపుతూ రైల్వే లైన్ మంజూరి చేసినందుకు గ్రామంలో బిజెపి కార్యకర్తలు ప్రజలు, నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చెసి కృతజ్ఞత చాటుకున్నారు. ఈ సందర్భంగా, పాయం వెంకయ్య జిల్లా ప్రధాన మంత్రి, నోముల రామరావు కిసాన్ మోర్చ రాష్ట్ర కార్య దర్శి, నోముల సత్యనారాయణ కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి, చిచ్చడి నారాయణ, పునేం సురేష్, పాల్గొన్నారు. కార్యక్రమసందర్భంగా నోముల రామరావు మాట్లాడుతూ ఎజన్సీ అభివృద్ధికి కృషిలో బాగంగా, ప్రధాని నరేంద్ర మోడిగారిని, రైల్వే మంత్రి వైష్ణవ కుమార్ గారు రైల్వే మార్గం ఇవ్వటం అభినందనీయం, వారికి కేంద్ర ప్రభుత్వా నికి, ప్రత్యేక ధన్యవాదములు.ఈ ప్రాంతానికి రైల్వే లైన్ ద్వార ప్రజల ఆర్థిక ఉపాధి వ్యవసాయ ఉత్పత్తుల, నిర్యుద్యోగులకు,మేలు కలుగుతుందని అన్నారు.

# యూపీ గవర్నర్ ఆనంది బెన్ పటేల్ చేతుల మీదుగా సూపర్ స్పెషాలిటీ పట్టా అందుకున్న మామిడిపల్లి సత్య సిద్ధార్థ

**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం గ్రామానికి చెందిన తిరుపతి వెంకట ఉషారాణి ఎం బిజీ తిలక్ కుమారుడు మామిడిపల్లి సత్య సిద్ధార్థ, ప్రాథమిక విద్య ఈ ప్రాంతంలో చదువుకొని వైద్య విద్య కోసం హైదరాబాదులోని కామినేని మెడికల్ కళాశాలలో ఎంబీ బిఎస్ పూర్తి చేసి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పీజీ చేశారు. తరువాత లక్నోలోని కింగ్ జార్జ్ యూనివర్సిటీలో సూపర్ స్పెషాలిటీ సర్జికల్ ఆంకాలజీలో ఎంసి హెచ్ పట్టా గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. సిద్ధార్థ తల్లిదండ్రులు ఎంబీజీ తిలక్ ఆంధ్రప్రదేశ్ సమాచారశాఖ డైరెక్టర్‌గా రిటైర్డ్ అయ్యారు. తల్లి ఉషారాణి ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.

# కూచిపూడి విద్యార్థికి సన్మానం

**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం గ్రామానికి చెందిన సాయి జోష్ణ దేవి కూచిపూడి నాట్యములు శిక్షణ తీసుకుంటూ తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో 80 ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు పొందింది. ఈ సందర్భంగా కూనవరం ప్రముఖ వైద్యులు డాక్టర్ డి వెంకయ్య మరియు కూనవరం పాత్రికేయులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి సత్యనారాయణ వెంకట్ నవీన్ ప్రింట్ మీడియా నుండి యాలం సీతారామయ్య కృష్ణ రమేష్ భాష సతీష్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డాక్టర్ పై జరిగిన క్రూరమైన సంఘటనకు వ్యతిరేకంగా ఆదిత్య విద్యార్థుల నిరసన ర్యాలీ

**– హత్య కేసులోని ముద్దాయిలను కఠినంగా శిక్షించాలి**

**– డాక్టర్ అడ్డాల సత్యనారాయణ**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కలకత్తాలోమహిళా డాక్టర్ పై జరిగిన క్రూరమైన సంఘటనకు వ్యతిరేకంగా ఆదిత్య డిగ్రీ విద్యార్థుల నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. కలకత్తాలో ఒక మహిళా వైద్యురాలు డ్యూటీలో ఉండగా ఆమె పైన జరిగిన హత్యాచారం భారత జాతి యావత్తు సిగ్గుపడే సంఘటన. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ వైద్యురాలిపై జరిగిన దుశ్చర్య తీవ్ర మనస్తాపం కలిగించిందని అన్నారు. ఈ పాశవిక చర్యలో పాత్ర పోషించిన మానవ మృగాలు ఎంత పలుకుబడిగలవారైనా శిక్ష పడేలా చేయాలని కోరారు. నిజా నిజాలను నిగ్గు తేల్చాలని సత్వర శిక్షలు విధించాలని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ మహిళలను పూజించే భారతదేశంలో మహిళల పట్ల కొన్ని మానవ మృగాలు చేస్తున్న పైశాచిక చేష్టల వలన ఆడపిల్లలకు , వారి తల్లిదండ్రులకు అభద్రతా భావం కలుగుతుందని చట్టాలను ప్రయోగించి తీవ్రమైన శిక్ష విధించినప్పుడే మరల ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని అన్నారు. స్త్రీలని గౌరవించడం మన సాంప్రదాయం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించ డానికి ముందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు కళాశాల నుండి శాంతినగర్‌లో గల మదర్ థెరీసా విగ్రహం వద్ద మానవహారాన్ని నిర్వహించి 'మానవ మృగాలను వెంటనే శిక్షించాలి–మహిళలను రక్షించాలి", "సత్వర న్యాయం జరగాలి" అనే నినాదాలను ఇవ్వడం జరిగింది. ర్యాలీ అనంతరం స్త్రీల పట్ల గౌరవ భావాన్ని కలిగి ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ఇన్చార్జ్ ఎన్. మూర్తి, ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# సమాజ దిక్‌సూచికలు నారీమణులు

**– ఇంజనీర్ గట్టి**

**కాకినాడ,మేజర్‌న్యూస్:**సమాజాన్ని అభివృపధంలోకి నడిపించా లంటే నారీమణుల సహకారం ఎంతో అవసరమని ప్రముఖ ఇం జనీర్, భారతీయ జనతా పార్టీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. గట్టి సతీమణి పుప్పాల రాంజీ జన్మదిన సందర్భంగా సుమారు మూడువందల మంది మహిళలకు చీరలు, పండ్లు, బిస్కెట్‌లు, పసుపు కుంకుమలు పంపిణి కార్యక్రమము స్థానిక శ్రీరామ్‌నగర్‌లో వున్న గట్టి ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణములో ఆదివారం సాయింత్రం జరిగింది. కార్యక్రమములో నగరప్ర ముఖులతో పాటు మాజీ కార్పోరేటర్లు, స్నేహితులు పలువురు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా గట్టి మాట్లాడుతూ మహిళలు అత్యంత పవిత్రంగా భావించే శ్రావణమాసంలో అందరూ సుఖసంతోషాలతో జీవనం సాగించాన్నదే రాంజీ ఆశయమని అందుకే నూతన వస్త్రాలను అందించాని అన్నారు. మహిళలు గృహాన్ని ఏవిధంగా అభివృద్ధి చేసుకుంటారో అదేవిధంగా సమాజాన్ని కూడా గాడిలో పెట్టగల సామర్థ్యం వుందని, ప్రభుత్వాలు కూడా వారి అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు, రాంజీ మాట్లాడుతూ నూతన వస్త్రాలను ధరించి శ్రావణశుక్రవారం పూజచేసుకోవలని అందరూ సుఖసంతోషాలతో వుండాలన్న ఆకాంక్ష వ్యక్తం చేసారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ గోడి సత్యవతి, గోడి వెంకట్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నియోజకవర్గం స్థాయిలో పిఠాపురం రథాలు పేట అంబేద్కర్ కమ్యునిటి హాలులో ఈ నెల 19వ తేదీ సోమవారం ఉదయం 10:గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్ర మానికి వివిధ శాఖలకు చెందిన జిల్లా దిగువ స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు ఉదయం 9.30 నిమిషాలకు పిఠాపురం రథాలు పేట అంబేద్కర్ కమ్యునిటి హాలులో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు యదావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్ర మానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయ న ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికా రులు అందరూ విధిగా ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశించారు. అర్జీదా రులు ఈ విషయాన్ని విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

# మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** బెల్ట్ షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం అదుపులో తీసుకున్న పోలీసులు అతని వద్ద 12 బీర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. పోలీ సులు తెలిపిన వివరాలు పరిశీలిస్తే... గొల్లప్రోలు మండల పరిధి తాటిపర్తి గ్రామా నికి చెందిన ఎస్.వీరబాబు గ్రామ శివారులో బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడు. గడిచిన కొంతకాలంగా వీరబాబు బెల్ట్‌షాప్ ద్వారా మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందరంతో గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి ఫ్రిజ్‌లో నిల్వచేసిన 12 బీరు బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ంగా బెల్ట్‌షాపును ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్న వీరబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## కలకత్తా మహిళా డాక్టర్ అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని

**యుటిఎఫ్ ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ**

**దోషులను కఠినంగా శిక్షించాలి ..ఎమ్మెల్సీ ఐవి డిమాండ్**

**అమలాపురం ఆగస్టు 18 :**కలకత్తా మహిళా డాక్టర్ మౌనిత అత్యాచారం హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( యుటిఎఫ్) భారత విద్యార్థి ఫెడరేషన్ మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నేడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి విచ్చేసిన గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ మౌనిత అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని దీని వెనక దాగివున్న సెక్స్ మానవ అవయవ ముఠా మరియు మందుల ముఠా దాగి ఉందని గ్యాంగ్ రేప్ కి గల కారణాలని హైకోర్టు స్పష్టంగా చెబుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం హాస్యాస్పదమని తక్షణం ఈ హత్య అత్యాచార వెనక ఉన్న ముఠాని గుర్తించి వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న డాక్టర్ మౌనిత హత్య వెనుక వాస్తవాలను బయటికి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని దీని వెనక దాగి ఉన్నటువంటి వారందరినీ బయటకు తీసి కఠినంగా శిక్షించాలని యువతని పెడదారులకు గురి చేసేటువంటి అశ్లీల వెబ్సైట్లను నియంత్రించే పని కేంద్ర ప్రభుత్వం చేయాలని ఆ పని కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని వాపోయారు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంకె వెంకటేశ్వరావు ఎంప్టీవి సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు పై అత్యాచారాలు ఈ కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయని ప్రతి అరగంటకి ఈ దేశంలో ఒక అత్యాచారం జరుగుతుందని ఈ కాలంలో సుమారు 9వేల హత్యచారాలు దేశవ్యాప్తంగా అత్యాచార కేసులు నమోదైనయని వీటిని నియంత్రించే దాంట్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యయని ప్రభుత్వం సమాజం కూడా ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దేశవ్యాప్తంగా డ్యూటీలో ఉన్న మహిళ డాక్టర్లు నర్సులు సిబ్బంది అందరికీ ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారంతా ముక్తకంతో డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు యు.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీ పెంకె వెంకటేశ్వరరావు, మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ ఎంటీవి సుబ్బారావుగారు,జిల్లా కార్యదర్సులు పెన్నాడ శ్రీనివాస్, బి. చంద్రకళ, కుడుపూడి శ్రీనివాస్, వై. మురళి కృష్ణ ఎస్ఎఫ్ఐ నాయకులు కే శంకర్ శశి వ్యవసాయికీర్మిక సంఘం నాయకులు కారెం వెంకటేశ్వరరావు శ్రీను తదితరులు పాల్గొన్నారు

# వికలాంగునికి నేనున్నానని భరోసా ఇచ్చిన జమాల్ ఖాన్

**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం మండలంలోని పైడిగూడెం గ్రామానికి చెందిన బత్తుల కొమరయ్య అనే వ్యక్తి కూలీ నాలి పనులు చేసుకుంటూ అవకాశం వచ్చినప్పుడు వివాహ ది కార్యక్రమాలకు మంగళ వాయిద్యాల పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేద కుటుంబం రెక్కాడితే కానీ డొక్కాడని పేదరికం ఈ సమయంలోనే పిడుగు లాంటి ఆపద వచ్చి పడింది ఆ కుటుంబం పై. పనికి వెళ్లి వస్తుండగా కాలులో ఇనుప మేకు గుచ్చుకోవడంతో అది కాస్త సెప్టిక్ గా మారి కాలు మొత్తం తొడ భాగం వరకు తీసివేసే పరిస్థితి ఏర్పడినది. చివరకు కుడికాలు లేకుండా పోయింది. తన ను ఇంకా ఎవరు ఆదుకుంటారని తన జీవితం ఇంతేనని నిస్సహాయ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న సమయంలో గ్రామానికి చెందిన కొందరు ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ కు సమాచారాన్ని చేరవేశారు పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించి ఆయనా హుటాహుటిన తన సిబ్బందితో పైడిగూడెం చేరుకొని కొమరయ్య నివాసానికి వెళ్లారు. వంటి కాలుతో చేతులు జోడిస్తూ నిస్సహాయ స్థితిలో కుటుంబ సభ్యులు కనిపించి కంటనీరు తెప్పించే దీనావస్థలో వారి కుటుంబ నేపథ్యం కనులకు కట్టినట్టు కనిపించింది. వెంటనే జమాల్ ఖాన్ కొమరయ్య కుటుంబాన్ని వెన్నుతడుతూ అధైర్య పడవద్దు నేనున్నాను నీకు జైపూర్ నుంచి కాలు తయారు చేయించి మా సిబ్బందిని పంపి కాలు ఏర్పాటు చేస్తానని మునుపటిలాగే అందరిలా నువ్వు తిరగవచ్చని కుటుంబాన్ని గడిపేందుకు నీకు కావలసిన సహాయ సహకారాలు జీవన భృతికి కావలసిన వి నా తరపు నుండి అన్ని విధాల సహకారం నీకు ఉంటుందని భరోసా ఇస్తూ తక్షణమే ఐదువేల రూపాయలను జెకె సి టి ట్రస్ట్ తరపున కొమరయ్యకు అందజేశారు. కుటుంబన్ని పోషించే యజమాని పనిలో లేకపోతే ఆ కుటుంబం ఎంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో నని పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరం కాకుండా వారిని హాస్టల్లో చేర్పించి మంచి విద్యను అందించి భవిష్యత్తును చక్కదిద్దాలని ఈ సందర్భంగా మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ఇచ్చారు. సందర్శించిన వారిలో మడివి అప్పారావు, సూఫీ, ఎడవల్లి భాస్కర్, ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్, రియాజ్, నటరాజ్, షారు క్ తదితరులు పాల్గొన్నారు.

# యూట్యూబ్ చానల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు

**– తమ నేత వ్యాఖ్యలను వక్రీకరించారంటూ టిడిపి ఫిర్యాదు**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** యూట్యూబ్ ఛానల్స్ తమ నాయకుడు వర్మ వ్యాఖ్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిఠాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం, కాకినాడలో వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కూటమి ప్రభుత్వం రాకతో మీకు చెక్ పడడం వాస్తవమేనని అన్న ప్రశ్నకు మా నాయకుడు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ చేసిన కామెంట్ ను 1.చరణ్ టీవీ యూ ట్యూబ్ ఛానల్ లో ఎర్రం రాజీవ్ అనువారు, 2. ఆర్కె టాటి అను వారు, 3. నిధి టీవీ అనువారు వాస్తవాలని వక్రికరించి, వారి సొంత పైత్యాన్ని వెళ్ళగ్రక్కుతూ, ప్రజా ప్రతినిధులు మధ్య, కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించడం కోసం చరణ్ టీవీ యూ ట్యూబ్ ఛానల్, ఎర్రం రాజీవ్ నోటికి వచ్చినట్టు, మా నాయకుడు వర్మను కించపరిచే విధంగా విశ్లేషణ్ చేసి యూ ట్యూబ్ లో ప్రచారం చేయడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ ప్రచారాలు చేసిన ఛానల్‌కి సంభందించిన విలేకరులు ఎవ్వరూ కూడా ప్రెస్ మీట్ లో పాల్గొనలేదని, కానీ ప్రెస్ మీట్ లో జరిగిన వాస్తవ విషయాన్ని పక్కన పెట్టి వీరు స్వలాభం కోసం ప్రభుత్వంలో పాలుపంచుకుంటున్న పార్టీలు మధ్య గొడవలు సృష్టించడానికి ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడ్డారని, వాస్తవానికి ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మాట్లాడిన విషయాలను ఆ ఛానల్ కు అనుకూలంగా ముక్కలుగా కత్తిరించి ప్రచారం చేయడం జరిగిందని పేర్కొన్నారు. కావున ఏలిన వారు తక్షణమే స్పందించి పై తెలిపిన ఈ 3యూట్యూబ్ ఛానల్ ప్రచారాలను నిలుపుదల చేసి, మా నాయకుడు పైన వ్యక్తిగతంగా కించపరుస్తూ వ్యాఖ్యాలు చేసినందుకు గాను, కూటమి ప్రభుత్వాని విచ్ఛిన్నం చేసే విధంగా కుట్రలు పన్నిన వారిపైన తక్షణమే అరెస్ట్ చేసి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిశెట్టి సత్యానంద రెడ్డి, సకుమళ్ళ గంగాధర్ రావు, పిల్లి చిన్నా, నల్లా శ్రీను, నెక్కల సత్యనారాయణ, కేతవరపు కృష్ణ, షేక్ యాసిన్, కో–ఆప్షన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# వేదాల సంరక్షణే సమాజానికి శ్రేయోదాయకం - పసుమర్తి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** వేదాల సంరక్షణ చేయడం ద్వారా సమాజంలో వున్న ప్రతీఒక్కరూ క్షేమంగా జీవనాన్ని కొనసాగించడానికి వీలువుంటుదని శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణ మూర్తి అన్నారు. శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో తొలి వేదస్వస్తిని స్థానిక వెంకట్‌నగర్ లోవున్న శివాలయంలో పసుమర్తి లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా బ్రాహ్మణసమాజానికి ఎంతో సేవలందిస్తున్న ఎస్.బి.ఐ. సీనియర్ విశ్రాంత అధికారి చీమలకొండను ఘనంగా సత్కరించారు. అనంతరం పసుమర్తి మాట్లాడుతూ వేద వాఙ్మయ సంరక్షణకే బ్రాహ్మణులు నిరంతరం కృషి చేస్తూవుంటారని, అటువంటివారికి ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించడంలో శ్రద్ధ కనబరచకపోవడం ఆవేదన కల్గిస్తోందన్నారు. కొత్తప్రభుత్వం బ్రాహ్మణుల సంరక్షణకై ప్రయత్నాలు చేయడం శుభపరిణామమని అన్నారు. వేదస్వస్తి సందర్భంగా పండితులు వల్లిస్తున్న వేద ఘోష ద్వారా ఆప్రాంతమంతా పరిమళించే విధంగా మారుతుందన్నారు. పరిసర ప్రాంతాలకు శుభాన్ని చేకూరుతుందన్నారు.సన్మానగ్రహీత చీమలకొండ కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ఏర్పాటుచేయడమే కాక అన్ని బ్రాహ్మణసంఘాలను పరస్పర స్నేహభావంతో కలుపుకొని ముందుకు పోవాలన్న ఆలోచన శ్రేయోదాయకమని అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ళ లక్ష్మినారాయణ శర్మ, తనికెళ్ళ వెంకటరామయ్య శర్మ, ముఖ్య సలహాదారులు నాగ మహాశయా, ఎల్లాప్రగడ పద్మనాభ స్వామి, ఉపాధ్యక్షులు కడియాల సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పొద్దుతురి బాలాజి విశ్వనాథ్, ఉప కార్యదర్శి మర్ల జగన్నాథ్ శర్మ, కోశధికారి కప్పగంతు సాయిరాం శర్మ, లయన్స్ ఎలైట్ క్లబ్ కార్యదర్శి కె.వి.వరప్రసాద్, కోంపెళ్ళ వెంకట సుబ్బారావు, పాండురంగ విఠల్, కందాల రవి, ఇంద్రగంటి శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు కందాల రవి, చివుకుల సుబ్బారావు, కళ్లురి రామకృష్ణ, కొంపెల్ల వెంకట సుబ్బారావు, ఎన్.లక్ష్మీనారాయణ, పూజ్యం నాగేంద్రశర్మ, రాయుడుపాలెం దుర్గాప్రసాద్ తోపాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల వ్యవస్థ పూర్వవైభవానికి కూటమి కృషి

కాకినాడ : జగన్ పాలనలో అస్తవ్యస్థమైన రేషన్ డీలర్ వ్యవస్థ తిరిగి చంద్రబాబు పాలనలో పూర్వ వైభవం సంతరంచుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల రాష్ట్ర అధ్యక్షులు దివి లిలా మాధవరావు పేర్కొన్నారు. స్థానిక అన్నదాన సమాజంలో కాకినాడ జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షులు నందిపాటి పల్లయ్య అధ్యక్షతన జిల్లా రేషన్ డీలర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాములో ఇంటింటికి రేషన్ పేరుమీద ఎం.డి.యు వాహనాలు ప్రవేశ పెట్టి రేషన్ డీలర్ల జీవితాలను చీకటిమయం చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాడి తప్పిన ప్రజా పంపిణీ విధానంలో పెను మార్పులు, సంస్కరణలు చేపట్టి తిరిగి యధావిధిగా రేషన్ డీలర్ల ద్వారానే ప్రజా పంపిణీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలానే శుభ సంకేతాన్ని ఇవ్వడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రం లో తిరిగి రేషన్ వ్యవస్థను పునరుద్ధరణ చేయడానికి రాష్ట్ర సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రమించి తీసుకున్న నిర్ణయంతో సుమారు 30 వేల కుటుంబాలకు భరోసా లభిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యంత్రి పవన్ కళ్యాణ్, సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్ర పటానికి పాలాభిషేకంచేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకురాలు తిరుపతి జిల్లా, చంద్రగిరి అధ్యక్షురాలు పి. హేమ లత, కాకినాడ సిటీ అధ్యక్షులు సోమిశెట్టి కుమార్.రూరల్ మండల అధ్యక్షులు డి.ఎం.రవితేజ,తాళ్ళరేవు మండల అధ్యక్షులు అందే కాశిరాజు, పిఠాపురం డివిజన్ బండి బుల్లియ్య, ,పెద్దాపురం డివిజన్ అధ్యక్షులు వి రామ్ పండు, గొల్లప్రోలు మండల అధ్యక్షులు కెపి నారాయణ అధిక సంఖ్యలో రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడే సంతోషిమాత ఉత్సవాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక భారతమాత సెంటర్ లో వున్న శ్రీ సంతోషిమాత ఆలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు గోపూజతో ఉత్స వాలను ప్రారంభిస్తారని అనంతరం ఆలయప్రధానార్చకులు మంధా ముత్యాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ మరియు అమ్మవారి భక్తుల సహాయసహకారాలతో పలు కార్యక్రమాలు జరుగుతుం దన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో శైవాగమ విధానముతో శ్రీఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యం మహాన్యాస పూర్వకముగా శ్రీ సంతోషిమాత అమ్మవారికి ఉపనిషత్తులతో ఏకాదశ రుద్రాభిషేకము, ఆవుపాలతో అభిషేకాలు జరుగుతా యన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి స్త్రీలచే సామూహిక సౌభాగ్య సుహాసిని లక్ష కుంకుమార్చన, హోమము, నీరాంజన మంత్రపుష్పములు, చతుర్వేద పారాయణ జరుగుతుందని, భక్తులందరూ విచ్చేసి అమ్మ కృపను పొందాల్సిందిగా కోరారు.

# ఘాటెక్కిన ఉల్లి ధర

**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** నిత్యవసర సరుకులలో ఉల్లిపాయలు కీలక పాత్ర పోషిస్తాయి. ఉల్లి లేనిదే ఇల్లు గడవదు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఉల్లి వాడకం అధికంగా ఉంటుంది. ఈ సంవత్సరం ఉల్లి ధర సామాన్యునికి భారంగా మారింది. ఇటీవల గొల్లప్రోలు టోకు మార్కెట్లో ఉల్లి ధర 10 కేజీలు 400 ధర పలికిస్తుంటే గొల్లప్రోలు రాయవరం రోడ్డు కూరగాయల మార్కెట్లో చిల్లర వర్తకులు కిలో ఉల్లి ధర 50 రూపాయలు నుండి 60 రూపాయలు ధర పలికిస్తున్నారని ప్రజలు ఉల్